


# కరపత్రం

SINCE 2014

శుక్రవారం అక్టోబర్ 18 2024 | సంపుటి :0 | సంచిక : 10 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4


## తాగితే రోగాలపాలు

- ఎసిడిక్ యాసిడ్, గ్లూకోజ్, వనస్పతిలతో తయారీ
- హైదరాబాద్ నగరం, చుట్టుపక్కల జిల్లాల్లో విక్రయం
- స్వచ్ఛభారత్, మేకిన్ ఇండియా లోగోలు వేసి మరీ అమ్మకం



2 లో

# పటిష్ట ప్రణాళికలతో ముందుకు సాగాలి !



- తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను నెరవేరుస్తామని అంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందుకు తగ్గట్లుగా అడుగులు వేయాలి.
- నీళ్లు, నిధులు,నియామకాలు అన్న ఆకాంక్షలు త్వరగా నెరవేర్చాలి.
- ఇదే సందర్భంలో ఇక ఉచిత పథకాలను దరిచేరకుండా పటిష్టమైన ఆర్థిక వ్యవస్థను రూపొందించుకోవాలి.
- రైతుబంధు, రైతు రుణమాఫీలు,రూపాయికి కిలోబియ్యం, ఆరోగ్యశ్రీ వంటి పథకాలకు చెక్ పెట్టాలి.
- పంటలను పూర్తి స్థాయిలో గిట్టుబాటు ధరలకు కొనడమే రైతులను ఆదుకోవడం అవుతుంది.
- వారికి సకాలంలో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచడం, పంటరుణాలను అందించడం,నీట వసతి కల్పించడం ప్రధాన ఎజెండా కావాలి.
- ఇవన్నీ కల్పించి పండించిన పంటలను సకాలంలో కొనుగోలు చేసే వ్యవస్థలను ఏర్పాటు

ప్రకృతి వైపరీత్యాల్లో ఆదుకునేలా ఉండాలి. చిన్ననీటి వనరులను అభివృద్ధి చేయాలి. ఇలా చేస్తే వ్యవసాయంతో పాటు, అనుబంధ రంగాలు కూడా అభివృద్ధి చెందుతాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. ఇవి చేయకుండా నేలవిడిచి సాము చేయడం సరికాదు. అలాగే విద్యావైద్య రంగాలను కూడా గ్రామస్థాయి లో పటిష్టం చేయాలి. సాగు,తాగునీటి వనరులతో పాటు, పంటలు పండే భూములకు ఇక్కడ కొదువలేదు. పనిచేయడానికి జనం ఉన్నారు. వీటి ఎలా ఉపయోగించాలన్నది నేతల సమర్థత మీద ఆధారపడి ఉంది. పథకాలు, పందేరాలతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకుని వెళ్లడం అసాధ్యం అని గుర్తించాలి. అలాగే గత కెసిఆర్ ప్రభుత్వంలా అభూతకల్పనలు,భ్రమలు కల్పించడం మానుకోవాలి. అప్పుడే గ్రామాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయి. పంచాయితీలను పటిష్టం చేసి వాటి ద్వారానే గ్రామాల పురోభివృద్ధికి పాటుపడాలి. రాజ్యాంగం ఇచ్చి అధికారాలను పంచాయితీలకు దఖలు పర్చాలి. తెలంగాణ ప్రజల బతుకులు మారాలన్న ఏకైక లక్ష్యంతో పోరాటం చేసి సాకారం చేసుకున్న ప్రత్యేక తెలంగాణ ఏర్పడి పదేళ్లు పూర్తి అయ్యాయి. నిజానికి ఇలాంటి చిన్న రాష్ట్రంలో అన్ని వనరులు ఉన్నా ప్రజల ఆకాంక్షలు తీరలేదు. ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పదేళ్లు కల్వంకుంట్ల కుటుంబం రాజభోగాలు అనుభవించింది. గడీల పాలన అందించింది. దీనిని నిందిస్తూ కాలయాపన చేయకుండా రేవంత్ సర్కార్ ముందుకు సాగాలి. అలాగే ఈ పదేళ్లలో తెలంగాణలో ఎవరి బతుకులు మారాయన్నది గమనిస్తే..

పేజి 2లో

## మహిళ మీద కన్నేసి బాలిక హత్య

### సూరారం బాలిక మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు



సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో దసరా పండుగ రోజు జరిగిన దారుణ ఘటనపై పోలీసులు కూలీ లాగి ఛేందించారు. అదృశ్యమైన ఏడేళ్ల చిన్నారి చివరికి ఓ సంచిలో మృతదేహమై కనిపించడంతో కేసు విషాదాంతమైంది. ఈ కేసును మేడ్చల్ జిల్లా సూరారం పోలీసులు ఛేదించారు. నిందితుడిని అరెస్ట్ చేసి విచారించగా, అసలు విషయం వెలుగుచూసింది. వివాహిత మీద కన్నేసిన నిందితుడు ఆమె కుమార్తెను హత్య చేశాడు. మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా బేల మండలం పాటగూడ గ్రామానికి చెందిన మిశ్రమ్ ప్రభాకర్ (40) ఏడు నెలల క్రితం హైదరాబాద్ వచ్చాడు.

2 లో

## నేతన్నలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్

### నాలుగు నెలలైనా అమలుకు నోచని హామీ



దసరా పండుగకు చేనేత సొసైటీల్లో వస్త్ర విక్రయాలకు ప్రభుత్వ ప్రోత్సాహం అందిస్తుందని ఆశించిన నేతన్నలకు నిరాశే మిగిలింది. పండుగకు ఇచ్చే రిబేటుపై ప్రభుత్వం ఎటువంటి ప్రకటనా చేయలేదు.

పేజి 2లో



## సుప్రీంకోర్టు తదుపరి సీజేగా జస్టిస్ సంజీవ్ ఖన్నా.. సిఫార్సు చేసిన సీజేఐ

దిల్లీ: దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తదుపరి సీజేగా సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నియమితులయ్యే అవకాశం ఉంది. ఈమేరకు తన తర్వాత భారత ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్

పేజి 2లో

## పత్తి మద్దతు ధరలపై మండిపడ్డ హరీష్ రావు

తెలంగాణ రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని భారాస నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు.

పేజి 2లో



## రైలులో ప్రయాణికుడి బ్యాగు చోరీ.. రైల్వేశాఖకు రూ.4.7లక్షలు జరిమానా!




2 లో

రిజర్వ్ చేసిన కోచ్‌లలో ప్రయాణికుల వస్తువులకు రైల్వేశాఖ బాధ్యత వహిస్తుందని ఎస్సీడీఆర్సీ తీర్పునిచ్చింది.

# దేశం గర్వించదగ్గ గిరిజన వీరుడు

### కుమ్రం భీం 84వ వర్ధంతికి కెటిఆర్ నివాళి





దేశం గర్వించదగ్గ గిరిజన తిరుగుబాటు వీరుడు, గోండు బెబ్బులి కుమ్రం భీం 84వ వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆదివాసీ యోధుడు, అరణ్య సూర్యుడు, పోరాటాల పోతుగడ్డ మీద పుట్టిన అడవి తల్లి ముద్దుబిడ్డ అని చెప్పారు. ఉద్యమ బాటలో, ఉజ్వల ప్రగతి దారిలో జల్.. జంగల్.. జమీన్ నినాదమే స్ఫూర్తిగా కొమురం భీం ఆశయాల అడుగు జాడల్లో పయనించామని తెలిపారు. కొండల్లో కోనల్లో వున్న ప్రతి గూడేనికి, తండాకు స్వచ్ఛమైన మంచినీళ్ల సరఫరాతో విష జ్వరాల చావుల నుంచి విముక్తి కల్పించామని వెల్లడించారు. 4 లక్షల ఎకరాలకుపైగా పోడు భూములపై హక్కులు కల్పిస్తూ.. అడవి బిడ్డలకు పట్టాభిషేకం చేశామని గుర్తుచేశారు. మావనాటే మావరాజ్.. 'మా గూడెంలో మా తండాలో మా రాజ్యం' ఆకాంక్ష స్వరాష్ట్రంలో నెరవేరిందని చెప్పారు.

పేజి 2లో

# అయినను పోయిరావలెను హస్తినకు..

### రేవంత్ ఢిల్లీ పర్యటనలపై కెటిఆర్ సెటైర్లు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ టూర్ పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా కామెంట్స్ చేశారు.

పైసా పనిలేదు-రాష్ట్రానికి రూపాయి లాభం లేదు.. 10నెలలు - 25 సార్లు - 50 రోజులు.. పోను 25 సార్లు, రాను 25 సార్లు, నీ ఢిల్లీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేసి సిల్వర్ జూబ్లీ కూడా చేస్తివి. తట్టా మట్టి తీసింది లేదు.. కొత్తగా చేసింది అసలే లేదు.. అయినను పోయి రావాలె హస్తినకు.. అంటూ ఎద్దేవా చేశారు.

పేజి 2లో



## వర్గీకరణ అంశంలో సీఎం ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేదు: మందకృష్ణ మాదిగ



హైదరాబాద్: మరో ఉద్యమానికి మాదిగ, ఉపకులాలు సిద్ధంగా ఉండాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అమలుచేసే విషయంలో రాష్ట్రం ముందుంటుందని సీఎం అన్నారని గుర్తుచేశారు. కానీ అమలు విషయంలో జాప్యం చేస్తున్నారని చెప్పారు.

2 లో

# పటిష్ట ప్రణాళికలతో ముందుకు సాగాలి !

మొదటిపేజీ తరువాయి

రాజకీయ పార్టీల్లో కొందరి బతుకులు మారాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంతో ప్రజల బతుకులు అలాగే ఉన్నాయి. ఈ క్రమంలో పదేళ్ల పాలనపైనా, ప్రజల జీవన చిత్రంపైనా చర్చించి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. రేవంత్ ప్రభుత్వం గత విధ్వంసాలను గుర్తించి ముందుకు సాగాలి. ప్రజలు ఏం కోరుకుంటున్నారో చర్చించాలి. మూసపద్దతిలో కాకుండా నిర్మాణాత్మక వైఖరితో ముందుకు సాగితే సింగపూర్, మలేషియా లాంటి చిన్నచిన్న దేశాలను అధిమించవచ్చు. నీళ్లు, నిధులు,నియామకాలు అన్న నినాదంలో ఏవీ సాకారం కాలేదు. గత ప్రభుత్వ తప్పిదాలను సమీక్షిం చుకుని ప్రజలు కోరుకుంటున్న విధంగా పాలన సాగించాలే కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేయాలి. లేకుంటే..రాజకీయాల్లో ప్రజలు తమదైన రీతిలో బుద్ది చెబుతారని గుర్తించాలి. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డ తరవాత తెలంగాణలో ప్రభుత్వ ఏర్పాటు లోనూ.. పథకాలను అమలు చేయడంలోనూ.. అంతకు మించిన స్వార్థ ప్రణాళికతో కెసిఆర్ తొమ్మిదిన్నరేళ్లు పాలించారు. అందుకే ఆయన రాజకీయ జీవితం ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా అప్రతిహతంగా కొనసాగింది. కానీ ప్రజలనే వారు ఎల్లవేళలా దేగకళ్లు పెట్టుకుని చూస్తుంటారని గమనించలేదు. ఇవాళ తెలంగాణ అమరవీరుల కోసం కన్నీరు కారుస్తానంటే ప్రజలు నమ్మరు. తవ్వినకొద్దీ అవినీతి పుట్టలు బయటపడుతున్నాయి. ఒక్కో పథకం తవ్వేకొద్దీ అవినీతే తప్ప ప్రజలకు మేలు చేసిన ఆనవాళ్లు కానరావడం లేదు. కాళేశ్వరంతో పాటు అనేక ప్రాజెక్టులను కట్టినట్లు చెప్పి అవినీతిని పారించారు. చెరువులను పునరుద్దరించి గొలుసుకట్టు చెరువులకు ప్రాణం పోసామని డొల్ల మాటలు ప్రచారం చేశారు. మిషన్ భగీరథతో ఇంటింటికీ మంచినీరు సరఫరా చేసామని బుకాయించారు. హరితహారంతో పచ్చదనాన్ని పెంచామని చెప్పి పచ్చి అబద్దాలు చెప్పారు. అన్ని పథకాల్లో అవినీతి దాగివుందన్న సత్యం బయటకు రావడంతో ప్రజలతో పాటు ప్రపంచం కూడా విస్తుపోయింది.ప్రజలకు ఆదర్శ నేతగా నిలవాల్సిన కెసిఆర్ కేవలం తన కుటుంబం, తన బంధువుల కోసం స్వార్థ రాజకీయాలు చేసారని చెప్పడంలో సందేహం లేదు. ఓ రకంగా చెప్పాలంటే పదేళ్ల కెసిఆర్ పాలన అంతా గోబెల్స్ ప్రచారంతో సాగింది. ఇప్పుడు అధికారం కోల్పోవడంతో అదే పనిలో బిఆర్ఎస్ నేతలు ఉన్నారు. నిత్యం ఏదో ఒక ఆరోపణతో తమ గత పాపాలను బయటకు రాకుండా చూస్తున్నారు.తెలంగాణలో కెసిఆర్‌ను మించిన విజినరీ నేత లేదని అప్పుడూ, ఇప్పుడూ భ్రమింప చేస్తున్నారు. కరిమింగిన వెలగ పండులా ఆయన విజినరీ అంతా లోపాలపుట్ట అని తేలింది. అనేక ఆశలు,ఆశయాలతో, అమరుల త్యాగాల తో పురుడుపోసుకున్న తెలంగాణను అభివృద్ధిపథంలో తీసుకెళ్లేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నా, స్వార్థమనే పథకంలో కొట్టుకు పోయాయి. ఈ క్రమంలో పదినెలల రేవంత్ ప్రభుత్వం ఆర్భాటాలకు, అనవసర ఖర్చుల కు, ఉచిత పథకాల జోలికి పోకుండా క్షేత్రస్థాయిలో సమస్యలపై దృష్టి సారించాలి. తెలంగాణ అభివృద్దిని మళ్లీ పట్టాలకు ఎక్కించాలి. తాము ఇచ్చిన గ్యారెంటీల పేరుతో కాలక్షేపం చేయకుండా గ్రామస్థాయిలో సమస్యలను ఆకళింపు చేసుకోవాలి. గ్రామాలను బలోపేతం చేసి అభివృద్ధి చేయాలి. నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మగౌరవ నినాదాలతో సాధించుకున్న ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షలను నెరవేర్చామన్న ఘనత సాధించాలి. ఉద్యోగాల కల్పన, గ్రామాల్లో ఉపాధి అవకాశాలు పెంచడం, వ్యవసాయాన్ని బలోపేతం చేయడం వంటి కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగించాలి.

## దేశం గర్వించదగ్గ గిరిజన వీరుడు

మొదటిపేజీ తరువాయి

2,471 గిరిజన పంచాయతీల్లో స్వయం పాలనా జెండా ఎగిరిందని అన్నారు. అవకాశాల్లో జనాభా దామాషా ప్రకారం సముచిత వాటా దక్కేలా గిరిజన రిజర్వేషన్లను 10 శాతానికి పెంచుతూ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. 188 గురుకుల పాఠశాలలు, 125 గురుకుల ఇంటర్ కాలేజీలు, 22 గురుకుల డిగ్రీ కళాశాలలతో అడవి బిడ్డల విద్యా వికాసానికి నిబద్ధతతో కృషి చేశామని పేర్కొన్నారు. అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్ షిప్ తో విదేశీ చదువుల కలలు సాకారం, గిరిజన యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దిన సీఎంఎస్టీఈఐ స్కీం, ఆ మహనీయుని పేరుతో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాను ఏర్పాటు చేశామన్నారు. హైదరాబాద్ నడిబొడ్డున నిర్మించిన కుమరం భీం ఆదివాసీ భవన్, సేవాలాల్ బంజారా భవన్లు గిరిజన అస్తిత్వానికి ప్రతీకలుగా నిలిచాయని తెలిపారు. గిరిజన సంస్కృతికి గొప్ప గౌరవమైన సమ్మక్క సారక్క జాతర, నాగోబా, జంగుబాయి, చెంచుల బౌలాపూర్, ఎరుకల నాంచారమ్మ, గాంధారి మైసమ్మ, కొలాం పండుగలకు భారీగా నిధులు విడుదల చేశామని, అధికారికంగా నిర్వహించామని వెల్లడించారు. అస్తిత్వ ఉద్యమాలకు, ఆత్మగౌరవ పోరాటాలకు నిత్య ప్రేరణ అందించే రణధీరుడు కుమ్రం భీంకు ఎక్స్ వేదికగా జోహార్లు అర్పించారు.

## మహిళ మీద కన్నేసి బాలిక హత్య

మొదటిపేజీ తరువాయి

ఇద్దరు కుమార్తెలు ఉన్న గ్రామానికే చెందిన మహిళతో కలిసి కుత్బుల్లాపూర్ పరిధి సూరారం జీవన్ జ్యోతినగర్ లో ఉంటున్నాడు. కూలి పనులు చేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మహిళకు ఇద్దరు కూతుళ్లు కాగా, పెద్ద కూతురు జోష్న వయసు ఏడేళ్లు.

ఈ క్రమంలో ప్రభాకర్ కు ఆ ప్రాంతానికే చెందిన తిరుపతి అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ప్రభాకర్ తన ఇంట్లోనే తిరుపతితో కలిసి తరుచూ మద్యం సేవించేవాడు. ఆ క్రమంలో ప్రభాకర్ ఇంట్లో ఉన్న మహిళపై తిరుపతి కన్నేశాడు. ఇద్దరు పిల్లలు, ప్రభాకర్ అడ్డు తొలగించుకుంటే ఆ వివాహితను తన సొంతం చేసుకోవాలని భావించాడు. తన ప్లాన్ ప్రకారం అక్టోబర్ 12న ఉదయం వివాహిత పెద్ద కుమార్తె (7)ను తన ఇంటికి తీసుకెళ్లాడు. మధ్యాహ్నం తిరుపతి ఆ బాలికను తిరిగి తీసుకొచ్చి ప్రభాకర్ ఇంట్లో వదిలేశాడు. సాయంత్రం మరోసారి ప్రభాకర్ ఇంటికి వచ్చి చూడగా, ఎవరూ లేరని తెలుసుకున్నాడు. దాంతో బాలికకు మరోసారి మాయ మాటలు చెప్పి బైకు మీద తీసుకెళ్లాడు. అయితే రాత్రి అయినా బాలిక ఇంటికి తిరిగి రాకపోవడంతో ప్రభాకర్, మహిళ కలిసి సూరారం పోలీసులను ఆశ్రయించారు. బాలిక అదృశ్యమైందని ఫిర్యాదు చేసి వివరాలు ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ప్రత్యేక బృందాలతో బాలిక ఆచూకీ కోసం గాలించారు. ఈ క్రమంలో మేడ్చల్ పోలిస్‌స్టేషన్ పరిధి బాసరేగడి గ్రామం సమీపంలో ఓ సంచిలో బాలిక మృతదేహం కనిపించింది. ఆ డెడ్ బాడీ అదృశ్యమైన చిన్నారిదేనని నిర్ధారించారు. బాలిక కనిపించకుండా పోయిన తరువాత నుంచి తిరుపతి జాడ లేకపోవడంతో పోలీసుల ఆ కోణంలోనూ దర్యాప్తు చేపట్టారు. బాలికను బైకు మీద తీసుకెళ్లినట్లు సీసీ కెమెరాల ద్వారా ద్వారా గుర్తించిన పోలీసులు మంగళవారం నిందితుడు తిరుపతిని అరెస్ట్ చేశారు.నిందుతుడు తిరుపతిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారని మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. చిన్నారిని బైకు మీద తీసుకెళ్లిన తిరుపతి బాసరగడి గ్రామం దగ్గర కత్తితో చిన్నారి గొంతు కోశాడు. కడుపుతో సైతం కత్తితో పొడిచి బాలికను చంపినట్లు నిందితుడు తిరుపతి అంగీకరించాడు. బాలిక మృతదేహాన్ని ఓ సంచిలో మూటకట్టి సమీపంలోని అటవీ ప్రాంతంలో విసిరేసి పారిపోయినట్లు తెలిపాడు.

## తాగితే రోగాలపాలు

మొదటిపేజీ తరువాయి

పాలు తెల్లగా ఉన్నాయి.. చిక్కగానూ ఉన్నాయి. ప్యాకెట్ అంతకన్నా అందంగా ఉంది. పైపెచ్చు దానిపైన 'స్వచ్ఛ భారత్, మేకిన్ ఇండియా' లోగోలు ఉన్నాయి. అన్నిటికన్నా ముఖ్యంగా ప్రముఖ బ్రాండ్లతో పోలిస్తే తక్కువ ధరకే ఇస్తున్నారు. ఈ కారణాలు చాలవా వినియోగదారులు ఆకర్షితులై కొనుగోలు చేయడానికి. ఈ బలహీనతలనే కొందరు స్వార్థపరులు సొమ్ము చేసుకుంటున్నారు. రసాయనాలు, ఇతర పదార్థాలతో నకిలీ పాలు తయారుచేస్తూ మోసాలకు తెగబడుతున్నారు. ఈ పాలు పసిబిడ్డలు కూడా తాగుతారని తెలిసీ విక్రయిస్తూ పాపాలకు ఒడిగడుతున్నారు. హైదరాబాద్ శివారులోని మేడిపల్లి పీర్జాదిగూడలో ఎస్‌వోటీ పోలీసులు తాజాగా ఓ తయారీ కేంద్రంలో తనిఖీలు నిర్వహించడంతో ఎంతో కాలంగా గుట్టుగా సాగుతున్న నకిలీ బాగోతం బయటపడింది. 'వాసన కోసం కొంచెం పాల పొడి వాడి..దానికి ఎసిడిక్ యాసిడ్, గ్లూకోజ్ ద్రావణం, చిరోటి రవ్వ, పామాయిల్, వనస్పతి' వంటి పదార్థాలు కలిపి రోజుకు 5 వేల లీటర్ల నకిలీ పాలు తయారు చేస్తున్నట్లు దర్యాప్తులో తేలడం ఆందోళనకర పరిణామం. గజేందర్‌సింగ్ అనే వ్యాపారి 'కోహినూర్, శ్రీకృష్ణ బ్రాండ్ల' పేరిట బేగంబజార్ కేంద్రంగా నగరంలోని పలు హోటళ్లు, టీ స్టాళ్లకు, రెస్టారెంట్లకు ఈ పాల ప్యాకెట్లు, అనుబంధ ఉత్పత్తులైన వెన్న, పెరుగు, ఐస్‌క్రీం వంటివీ విక్రయిస్తున్నట్లు తెలుసుకున్న దర్యాప్తు అధికారులు అవాక్కయ్యారు. ప్రసిద్ధ కంపెనీల పేరుతో ప్యాకెట్లు రూపొందించి నకిలీ పాలు, పాల పదార్థాలు విక్రయిస్తున్నట్టు ప్రభుత్వ రంగ సంస్థ అయిన విజయ డెయిరీతో పాటు ఇతర సహకార, ప్రైవేటు డెయిరీలు తరచూ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకున్న వారు లేరనే విమర్శలున్నాయి. తమ బ్రాండ్‌ను కొన్ని సంస్థలు వినియోగిస్తున్నట్టు విజయ డెయిరీ ఇటీవలి కాలంలోనే ఐదారు సార్లు ఫిర్యాదు చేసింది. ఏయే కంపెనీలు అక్రమాలకు పాల్పడుతున్నాయో ఫిర్యాదులో పేర్కొన్నా చర్యలు లేకపోవడంతో నకిలీ దందా కొనసాగుతోందనే ఆరోపణలున్నాయి.

### వినియోగదారుల బలహీనతలతో...

మార్కెట్లో లభ్యమయ్యే ప్రముఖ డెయిరీల పాల ఉత్పత్తుల ధరతో పోలిస్తే సగం ధరకే విక్రయిస్తుండటంతో కొందరు వీటి వైపు మొగ్గుచూపుతున్నట్టు ఎస్‌వోటీ పోలీసు వర్గాలు చెబుతున్నాయి. 'చిక్కగా ఉంటాయని, నాణ్యమైనవి అంటూ వాటిని హోటళ్లకు, వినియోగదారులకు అంటగడుతున్నారు. కోహినూర్, శ్రీకృష్ణ బ్రాండ్ల పేరిట ముద్రించిన ప్యాకెట్లలో నింపిన పాలు, అనుబంధ ఉత్పత్తులను సదరు వ్యాపారి నగరంలోని 50 హోటళ్లకు, పలు స్వీట్ హౌస్‌లకు విక్రయించినట్టు ప్రాథమికంగా గుర్తించాం. ప్యాకెట్లపై స్వచ్ఛభారత్, మేక్ ఇన్ ఇండియా లోగోలనూ ముద్రించాడు' అని ఆ వర్గాలు వెల్లడించాయి. హైదరాబాద్ నగర పరిధిలోని పలు ప్రాంతాల్లో, రాజధాని చుట్టుపక్కల ఉన్న జిల్లాల్లోనూ ఈ తరహా పాల తయారీ, విక్రయాలు జరుగుతున్నాయని అనుమానిస్తున్న ఆ వర్గాలు ఆ దిశగా ఆరా తీస్తున్నాయి.

### పీర్జాదిగూడలో నకిలీ పదార్థాలతో తయారు చేసిన బర్ఫీ ప్యాకెట్లు

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నివసించే జనాభా కోటికి పైనే. రోజువారీ పాల అమ్మకాలు దాదాపు 30 లక్షల లీటర్లు. సహకార డెయిరీలు దాదాపు 10 లక్షల లీటర్లు విక్రయిస్తుండగా, ప్రైవేటు డెయిరీలు దాదాపు 18-19 లక్షల లీటర్లు అమ్ముతున్నాయి. కొందరు నకిలీ, కల్తీ పాలతో లక్ష లీటర్ల వరకూ విక్రయాలు సాగిస్తున్నారు.

## పత్తి మద్దతు ధరలపై మండిపడ్డ హరీష్ రావు

మొదటిపేజీ తరువాయి

పత్తికి కేంద్రం చెల్లించే మద్దతు ధర ఒక్కో రాష్ట్రంలో ఒక్కోవిధంగా ఎందుకు ఉందని ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు. ఒకే దేశం-ఒకే పన్ను, ఒకే దేశం- ఒకే ఎన్నిక, ఒకే దేశం- ఒకే రేషన్ అంటూ ఊదరగొట్టే కేంద్ర ప్రభుత్వం.. ఒకే దేశం ఒకే కనీస మద్దతు ధర ఎందుకు ఇవ్వడం లేదు. నాణ్యమైన పత్తిని పండిస్తున్న తెలంగాణ రైతు పట్ల ఎందుకీ వివక్ష? గుజరాత్ పత్తికి మద్దతు ధరగా క్వింటాకు రూ.8,257 చెల్లిస్తున్న కేంద్రం.. తెలంగాణకు రూ.7,521 మాత్రమే ఇవ్వడం దుర్మార్గం. గుజరాత్‌కు ఒక నీతి, తెలంగాణకు ఒక నీతా? అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## అయినను పోయిరావలెను హస్తినకు..

మొదటిపేజీ తరువాయి

అన్నదాతల అరిగోసలు.. గాల్లో దీపాల్లా గురుకులాలు.. కుంటుపడ్డ వైద్యం.. గాడి తప్పిన విద్యా వ్యవస్థ.. అయినను పోయి రావాలె హస్తినకు.. మూసి పేరుతో - హైడ్రా పేరుతో పేదోళ్ల పొట్టలు కొట్టి - 420 హామీలను మడతపెట్టి మూలకు వేసి.. అయినను పోయి రావాలె హస్తినకు.. పండగలు పండగళ్లా లేవు.. ఆడబిడ్డల చీరలు అందనేలేవు.. అవ్వా తాతలు అనుకున్న పింఛను లేదు.. తులం బంగారం జాడనే లేదు.. స్కూటీలు లేవు.. కుట్టు మిషిన్లు లేవు.. అయినను పోయి రావాలె హస్తినకు' అంటూ కేటీఆర్ విమర్శలు చేశారు. కాగా పేదల ఇళ్లు కూల్చి.. బిల్డర్లు, వ్యాపారవేత్తలను భయపెట్టి డబ్బు వసూళ్ల కోసమే రేవంత్ సర్కార్ హైడ్రా తెచ్చిందని కేటీఆర్ ఆరోపించారు. పేదలకు తాము అండగా ఉంటామని, క్షేత్రస్థాయిలో పర్యటించి.. బస్తీలు, కాలనీల్లోని వారి భరోసా కల్పిస్తామన్నారు. ఖజానా దివాలా తీసిందని ప్రచారం చేస్తూ.. తెలంగాణ పట్ల అందరూ నమ్మకం కోల్పోయేలా.. రేవంత్‌రెడ్డి అసమర్థ పాలన సాగిస్తున్నారని విమర్శించారు. దిక్కుమాలిన పాలనవల్ల హైదరాబాద్ రియల్ ఎస్టేట్ పడిపోయిందన్నారు. లక్షన్నర కోట్లతో చేపడుతున్న మూసీ సుందరీకరణ వెనుక భారీ కుంభకోణం ఉందని, దానికోసం నిధులు ఎక్కడి నుంచి తెస్తారని ప్రశ్నించారు.

## రైలులో ప్రయాణికుడి బ్యాగు చోరీ.. రైల్వేశాఖకు రూ.4.7లక్షలు జరిమానా!

మొదటిపేజీ తరువాయి

రైలులో రిజర్వ్ చేసిన కోచ్‌లలో ప్రయాణికులకు సంబంధించిన వస్తువులకు రైల్వేశాఖ భద్రత కల్పించాలని జాతీయ వినియోగదారులు వివాదాల పరిష్కార కమిషన్ పేర్కొంది. 2017లో చోరీకి గురయిన ఓ వ్యక్తి బ్యాగుకు రైల్వేశాఖ బాధ్యత వహిస్తుందని పేర్కొంటూ.. బాధితుడికి రూ.4.7లక్షలు పరిహారం చెల్లించాలని తీర్పునిచ్చింది.

దిలీప్ కుమార్ చతుర్వేది అనే వ్యక్తి 2017 మేలో అమర్‌కంట్ ఎక్స్‌ప్రెస్‌లో ముందుగానే రిజర్వ్ చేసుకొని తన కుటుంబసభ్యులతో కలిసి ప్రయాణించారు. ఆ సమయంలో ఆ కోచ్‌లోకి బయటి వ్యక్తులు రావడంతో అతని బ్యాగు చోరీకి గురయ్యింది. అందులో రూ.9.3లక్షలు విలువైన వస్తువులు, నగదు ఉన్నాయి. ఘటన అనంతరం చతుర్వేదీ ఫిర్యాదు చేశారు. ఈ చోరీకి టీటీఈ నిర్లక్ష్యమే కారణమని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. తాజాగా దీనిపై విచారించిన ఎన్సీడీఆర్సీ ఈ చోరీకి రైల్వేశాఖ బాధ్యత వహిస్తుందని తీర్పునిచ్చింది.

అయితే.. రైల్వే చట్టంలోని సెక్షన్ 100 ప్రకారం.. ప్రయాణికుల వస్తువులకు తాము బాధ్యత కాదని రైల్వేశాఖ వాదించింది. ఈ వాదనలను ఎన్సీడీఆర్సీ తోసిపుచ్చింది. రిజర్వ్ చేసుకున్న కోచ్‌లలో ప్రయాణికులు, వారి వస్తువులకు రైల్వేశాఖ బాధ్యత వహించాలని పేర్కొంది. అదేవిధంగా ఈ చోరీకి రైల్వే అధికారులు ముఖ్యంగా టీటీఈ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని తెలిపింది. అనంతరం బాధితుడికి పరిహారంగా రూ.4.7లక్షలు జరిమానా విధించాలని తీర్పునిచ్చింది.

## సుప్రీంకోర్టు తదుపరి సీజేగా జస్టిస్ సంజీవ్ ఖన్నా.. సిఫార్సు చేసిన సీజేఐ

మొదటిపేజీ తరువాయి



ఖన్నా పేరును ప్రస్తుత సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఈ సిఫార్సులకు కేంద్రం ఆమోదం తెలిపితే సుప్రీంకోర్టు 51వ సీజేగా జస్టిస్ ఖన్నా నియమితులు కానున్నారు.నిబంధనల ప్రకారం.. ఈ ప్రతిపాదనను ప్రస్తుత సీజేఐ లేఖ రూపంలో కేంద్ర న్యాయశాఖకు పంపుతారు. ఆ లేఖను కేంద్ర న్యాయశాఖ.. ప్రధానమంత్రి పరిశీలన కోసం పంపనుంది. ఆయన ఆమోదం తర్వాత రాష్ట్రపతికి చేరుకుంటుంది. అంతిమంగా రాష్ట్రపతి అనుమతితో తదుపరి ప్రధాన న్యాయమూర్తి బాధ్యతలు చేపడతారు.సంప్రదాయం ప్రకారం సీజేఐ తన తర్వాత ఆ పదవిని చేపట్టేందుకు సుప్రీంకోర్టులోని అత్యంత సీనియర్ న్యాయమూర్తి పేరును సిఫార్సు చేస్తారు. ఆ లెక్కన జస్టిస్ డి.వై.చంద్రచూడ్ తర్వాత జస్టిస్ ఖన్నా అత్యంత సీనియర్‌గా ఉన్నారు. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ పదవీకాలం ఈ ఏడాది నవంబరు 11తో ముగియనుంది. ఆ మరుసటిరోజున అంటే నవంబరు 12న జస్టిస్ ఖన్నా సీజేఐగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. ఆరు నెలల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. వచ్చే ఏడాది మే 13న ఆయన పదవీ విరమణ చేస్తారు.


## నేతన్నలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్

మొదటిపేజీ తరువాయి

దీంతో సాదాసీదాగానే వస్త్ర వ్యాపారం సాగింది. 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించుకున్న నేతన్నలకు ఉచితంగా విద్యుత్ అందిస్తామని కూటమి నేతలు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. అయితే టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలవుతున్నా ఈ హామీ అమలుకు నోచుకోలేదు. మరోపక్క రిబేటు, యార్న్ సబ్సిడీ పాత బకాయిలను ప్రభుత్వం విడుదల చేయలేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూడా అమలు చేయకపోవడంతో నేతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, రాష్ట్ర విభజన తర్వాత 2014-19 మధ్యకాలంలోనూ చేనేత వస్త్ర ఉత్పత్తుల అమ్మకాలను ప్రభుత్వాలు ప్రోత్సహించాయి. పండుగల రోజుల్లో సొసైటీల్లో వస్త్ర విక్రయాలపై 30 శాతం రిబేటు ప్రకటించాయి. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేత వస్త్ర విక్రయాలకు ప్రభుత్వాలు ఇచ్చే ప్రోత్సాహాలను, సొసైటీలకు విడుదల చేయాల్సిన రాయితీ బకాయిలను నిలిపివేసింది. తాజాగా టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఏడాది జూలై 13న రాష్ట్ర బిసి సంక్షేమం, చేనేత, టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి ఎస్.సవిత కృష్ణాజిల్లా పెడన, గూడూరు మండలాల్లో పర్యటించి ప్రసిద్ధి చెందిన చేనేత సొసైటీలను పరిశీలించారు. నేతన్నలను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ప్రకటించారు. దీంతో గత టిడిపి హయాంలోలాగా సొసైటీల్లో వస్త్ర విక్రయాలపై పండుగలకు ప్రభుత్వం 30 శాతం రిబేటు ప్రకటిస్తుందని, తద్వారా ఈ ఏడాది వస్త్ర వ్యాపారం పెరుగుతుందని ఆశించిన వారికి నిరాశే మిగిలింది. కృష్ణాజిల్లాలోని 37 సొసైటీల్లో ప్రతి ఏటా సగటున రూ.11.99 కోట్ల విలువైన 7,02,633 మీటర్ల చేనేత వస్త్రాల ఉత్పత్తి జరుగుతోంది. వినాయక చవితి, దసరా, దీపావళి, సంక్రాంతి పండుగలకు గతంలో 30 శాతం రిబేటు ప్రకటించారు. ఆయా సందర్భాల్లో సొసైటీల్లో 35 శాతం వరకు చేనేత వస్త్ర విక్రయాలు పెరిగాయి. తాజాగా రిబేటుపై

## వర్గీకరణ అంశంలో సీఎం ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేదు: మందకృష్ణ మాదిగ

మొదటిపేజీ తరువాయి




"ఎస్సీ వర్గీకరణ అమలులో ఎందుకు జాప్యం చేస్తున్నారు? మాదిగలపై రేవంత్‌వి తేనె పూసిన మాటలు. నమ్మించడంలో ఘనుడు.. మోసం చేయడంలో అంతకన్నా పెద్ద ఘనుడే. వర్గీకరణ అంశంపై సీఎం తాను ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదు. ఎస్సీ వర్గీకరణ విషయంలో పంజాబ్, తమిళనాడు తొలి వరసలో నిలిచాయి. ముందు అమలుచేస్తామన్న రేవంత్ మాటలకు విలువ లేకుండాపోయింది" అని మందకృష్ణ మాదిగ విమర్శించారు.

## జాతీయ పతాకానికి సెల్యూట్.. భారత్ మాతాకీ జై నినాదాలు.. నిందితుడికి హైకోర్టు ఆదేశం

భోపాల్: పొరుగుదేశం పాక్ అనుకూల నినాదాలు చేసిన వ్యక్తికి బెయిల్ మంజూరు సందర్భంగా మధ్యప్రదేశ్ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. అతడిలో దేశభక్తిని పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కేసు విచారణ ముగిసేవరకు పోలీస్‌స్టేషన్‌లో జాతీయ జెండాకు సెల్యూట్ చేయాలని, 'భారత్ మాతాకీ జై' అని నినాదాలు చేయాలని ఆదేశించింది. నెలలో రెండుసార్లు ఇలా చేయాలంటూ జస్టిస్ డీకే పలివాల్ నేతృత్వంలోని ధర్మాసనం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.భోపాల్‌లోని మిస్రోడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉండే ఫైజల్ అలియాస్ ఫైజాన్ ఈ ఏడాది మే నెలలో పాక్ అనుకూల నినాదాలు చేశారన్న కారణంతో పోలీసులు అరెస్ట్ చేశారు. భారత్‌ను అగౌరవపరుస్తూ.. పాక్ అనుకూల నినాదాలు చేస్తున్న వీడియో ఆధారంగా ఐపీసీలోని వివిధ సెక్షన్ల కింద వర్గాల మధ్య చిచ్చు, దేశ సమగ్రతను దెబ్బతీసేలా వ్యవహరించడం వంటి అభియోగాలను మోపారు. తాజాగా ఈ కేసు విచారణ సందర్భంగా రూ.50వేలు పూచీకత్తుపై ఫైజాన్‌కు మధ్యప్రదేశ్ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరుచేసింది.

# మాదకద్రవ్యాల నిరోధానికి పకడ్బందీ చర్యలు





## - కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

**కరపత్రం కలెక్టరేట్ నిజామాబాద్, అక్టోబర్ 17 :**
గంజాయి,క్లోరోఫామ్,అల్ప్రాజోలం వంటి మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల నిరోధానికి సంబంధిత శాఖల అధికారులు కలిసికట్టుగా కృషి చేస్తూ పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ అధ్యక్షతన గురువారం జిల్లా స్థాయి మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశం జరిగింది. పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగేనవార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం,రవాణా తదితర అంశాలపై సమావేశంలో చర్చించి, వాటి నియంత్రణకు చేపట్టాల్సిన చర్యల గురించి కలెక్టర్ సూచనలు చేశారు. జిల్లాలో మత్తు పదార్థాలు,మాదకద్రవ్యాల వినియోగం,రవాణాపై ఉక్కుపాదం మోపేందుకు అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని అన్నారు. జిల్లాలో గంజాయి సాగు లేనప్పటికీ ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతాలైన వైజాగ్, పాడేరు, అరకు తదితర ఏరియాల నుండి నిజామాబాద్ మీదుగా గంజాయిని అడపాదడపా మహారాష్ట్రకు స్మగ్లింగ్ చేస్తున్నందున గట్టి నిఘా ఉంచాలన్నారు. ముఖ్యంగా రోడ్డు, రైలు మార్గాల ద్వారా వీటిని రవాణా చేసే అవకాశాలు ఉన్నందున ఆర్టీసీ, రైల్వే అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని, తనిఖీ కేంద్రాల వద్ద గట్టి నిఘా ఉంచాలని అన్నారు. గంజాయి విక్రేతలను, దానిని వినియోగించే వారిని గుర్తించి కఠిన శిక్ష పడేలా చూడాలన్నారు. అదేవిధంగా కల్తీ కల్లు తయారీ కోసం వినియోగించే అల్ప్రాజోలం నిల్వలను వెలికితీయాలని, ఈ దిశగా, పోలీస్, ఎక్సైజ్, రవాణా తదితర శాఖలు సమన్వయంతో ముందుకెళ్లాలని కలెక్టర్ హితవు పలికారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు వివరిస్తూ విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు వీటికి అలవాటుపడకుండా ఉండేందుకు వీలుగా కళాశాలల్లో క్రమం తప్పకుండా అవగాహన సదస్సులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. మత్తు పదార్థాలకు అలవాటుపడిన వారిని ఆ వ్యసనం మానుకునేలా డీ-అడిక్షన్ సెంటర్లలో చేర్పించాలని అన్నారు.కాగా, గడిచిన 2023 సంవత్సరంతో పోలిస్తే జిల్లాలో ఈ ఏడాది గంజాయి కేసులు కొంతవరకు తగ్గాయని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ వివరించారు.ఎక్సైజ్ శాఖతో సమన్వయం పెంపొందించుకుని మత్తు పదార్థాలు రవాణా,వినియోగాన్ని పూర్తిగా అరికట్టే దిశగా పోలీస్ శాఖ తరపున కృషి చేస్తున్నామని తెలిపారు.ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్, అదనపు డీ.సీ.పీ బస్వారెడ్డి,నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్,ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి,డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ,ఆర్టీసీ ఆర్.ఎం జానీరెడ్డి,డీఐఈఓ రవికుమార్,అటవీ,రవాణా,వాణిజ్య పన్నులు,ఔషధ నియంత్రణ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి... విద్యార్థి సంఘ నాయకులు



**కరపత్రం బాన్సువాడ అక్టోబర్ 17**
రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం నడుస్తున్న విద్యార్థుల సమస్యలను పరిశీలించడంలో ప్రభుత్వం విఫలమైందని విద్యార్థి సంఘ జిల్లా నాయకులు నిఖిల్ గౌడ్ అన్నారు. బాన్సువాడ పట్టణంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ మూడు సంవత్సరాల ఫీజు రీయంబర్స్మెంట్ , స్కాలర్ షిప్ దాదాపు 6 వేల కోట్ల బకాయిలు విడుదల చేయక ఒక వైపు కళాశాల యాజమాన్యం, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలను విడుదల చేయాలని, లేనిపక్షంలో విద్యార్థి సంఘాల అద్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.. ఈ కార్యక్రమంలో మండల నాయకులు భాను, సభ్యులు ప్రశాంత్, దినేష్, గణేష్,అరుణ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ అభివృద్ధిని మరింత మెరుగుపరుస్తాం .. మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్




**కరపత్రం బాన్సువాడ అక్టోబర్ 17**
బాన్సువాడ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం గురువారం మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్వసభ్య సమావేశంలో పాలకవర్గ సభ్యులతో కలిసి చేపట్టాల్సిన పనులపై ఏకగ్రీవ తీర్మానం చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 19 వార్డులలో మూడు కోట్ల 10 లక్షల రూపాయలతో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను చేపడతామన్నారు. అమృత్ పథకం కింద మంజూరైన 52 కోట్ల నిధులతో పట్టణంలో మరో 50 సంవత్సరాల వరకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రణాళికతో పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్రీహరి రాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్, కౌన్సిలర్లు నార్లనంద కిషోర్ గుప్తా, రమాదేవి రాజాగౌడ్, బాడీ శ్రీనివాస్,సరితా, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు

# కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన పోచారం, కాసుల

## రైతు సంక్షేమం కోసం పనిచేస్తున్న ప్రభుత్వం... పోచారం శ్రీనివాస్ రెడ్డి



**కరపత్రం బాన్సువాడ అక్టోబర్ 17**
రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అనునిత్యం కృషి చేస్తుందని, రైతులు తాము పండించిన పంటలను కొనుగోలు కేంద్రాల్లోని విక్రయించి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి గురువారం బాన్సువాడ మండలంలోని బుడిమి సొసైటీ పరిధిలో గల్ తాడుకోల్, బీర్కూర్ మండల కేంద్రంలో సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే కొనుగోలు కేంద్రాన్ని కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తుందని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ పంటలను విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. ప్రజా ప్రభుత్వంలో రైతులను ఆర్థికంగా వృద్ధి సాధించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు గంగుల గంగారాం , మైనారిటీ జిల్లా అధ్యక్షులు ఖలేక్ , బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అసద్ బిన్ మోసిన్ ,పిట్ల శ్రీధర్ , ఉపాధ్యక్షులు మధుసూదన్ రెడ్డి బీర్కూర్ మండల అధ్యక్షులు శంకర్ ,బీర్కూర్, బాన్సువాడ, బుడిమి సొసైటీ చైర్మన్లు గాంధీ, కృష్ణారెడ్డి, గంగుల గంగారం, గోపాల్ రెడ్డి , గుడల నగేష్ , మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నార్ల సురేష్ గుప్తా ,మాజీ ఎంపీపీలు రఘు విజయ్ ప్రకాష్ , నాయకులు ఏజాస్, హకీమ్ , మాజీ సర్పంచ్ కుమ్మరి సాయిలు,డైరెక్టర్ రెంజర్లా సాయిలు,గౌస్, అందే రమేష్, సలీం , మాజీ సర్పంచ్ సానేపు గంగారాం, యమ రాములు మాజీ ఉపసర్పంచ్ నబీ,వాహబ్ , శంకర్, రమేష్ , కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు



# ఎంపీడీవో కార్యాలయానికి తాళం వేసిన భవన యజమాని



**కరపత్రం బాన్సువాడ అక్టోబర్ 17**
చందూర్ మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయాన్ని అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. గత 26 నెలలుగా భవనానికి అద్దె చెల్లించకపోవడంతో ఇంటి యజమాని గురువారం మధ్యాహ్నం ఎంపీడీవో కార్యాలయానికి తాళం వేశారు. ఇంటి అద్దెకు సంబంధించిన బకాయిలు చెల్లించే వరకు కార్యాలయానికి తాళం తీయనని భీష్మించు కూర్చున్నారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి బకాయిలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో కార్యాలయానికి తాళం తీశారు.

# కలెక్టరేట్ లో ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి





**కరపత్రం కలెక్టరేట్,నిజామాబాద్, అక్టోబర్ 17 :**
ఆదికవి మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్) సమావేశ మందిరంలో అధికారికంగా నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకలకు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధ్యక్షత వహించగా,నగర మేయర్ నీతూకిరణ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం, జ్యోతి ప్రజ్వలన చేసి జయంతి కార్యక్రమాన్ని కొనసాగించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,అన్ని కులమతాలకు చెందిన సంప్రదాయాలు,పండుగలకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ,మహనీయుల జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తోందని గుర్తు చేశారు. ఇందులో భాగంగానే మహర్షి వాల్మీకి జయంతిని ప్రభుత్వపరంగా నిర్వహించడం జరుగుతోందన్నారు. మహోన్నతమైన రామాయణ గ్రంథాన్ని అందించిన మహాకవి వాల్మీకిని ప్రతి ఒక్కరు స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దుర్గుణాలను విడనాడి, సద్గుణాలను అలవర్చుకోవాలని, సమాజ అభ్యున్నతికి పాటుపడాలని పిలుపునిచ్చారు.వాల్మీకి రచించిన రామాయణంలోని ప్రతి ఘట్టం నైతిక,సామాజిక విలువలను ఉపదేశిస్తుందని,కుటుంబ బంధాలు,సుపరిపాలన వంటి అనేకానేక అంశాలను బోధిస్తుందని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అంకిత్,జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి రమేష్, నర్సయ్య,డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, వాల్మీకి సంఘం అధ్యక్షుడు నరేష్,బీ.సీ సంఘాల నాయకులు బుస్సా ఆంజనేయులు,రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సొసైటీ చైర్మన్



**కరపత్రంమమ్మద్ నగర్ అక్టోబర్ 17**
మహ్మద్ నగర్ మండలంలోని గుంకల్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ వాజిద్ అలీ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లయ్య గారి ఆకాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి రాములు, గ్రామ పార్టీ అధ్యక్షులు తోటరాజు, కాశయ్య,గంగాగౌడ్, రామా గౌడ్, జనార్దన్ గౌడ్, సాయిలు, వెంకట రాములు, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యపు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సొసైటీ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్

## -- దళారులకు ధాన్యాన్ని అమ్మి మోసపోవద్దు... చైర్మన్ శ్రీనివాస్ యాదవ్

**కరపత్రం నసురుల్లాబాద్ అక్టోబర్ 17**

నసురుల్లాబాద్ మండలంలోని దుర్కి సొసైటీ ఆవరణలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని గురువారం సొసైటీ చైర్మన్ డివిటి శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోని విక్రయించి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలన్నారు. రైతులు అత్యాశకు పోయి దళారులకు అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి 2320, బి గ్రేడ్ ధాన్యానికి 2300 ప్రకటించిందన్నారు. కొనుగోలు




కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ బావయ్య, మాజీ సర్పంచ్ నారా గౌడ్, మాజీ ఎంపిటిసి నారాయణ,అధికారులు నర్సింలు, కవిత, సాయినాథ్, ఏఈఓ సాయి సుమన, డైరెక్టర్లు రాజు, రాములు, గంగారం, గ్రామస్తులు రైతులు తదితరులు

# త్వరలోనే పట్టాలకెక్కనున్న ఓజీ




అగ్ర కథానాయకుడు పవన్‌కల్యాణ్ సినిమాలు ఒకదానివెంట మరొకటి వరుసగా పునః ప్రారంభం అవుతున్నాయి. 'హరి హర వీరమల్లు' చిత్రీకరణ ఇప్పటికే ఊపందుకుంది. విజయవాడలో కీలక సన్నివేశాల్ని చిత్రీకరిస్తున్నారు. త్వరలోనే 'ఓజీ' సెట్‌లోకీ అడుగు పెట్టనున్నారు పవన్‌కల్యాణ్. సుజీత్ దర్శకత్వం వహిస్తున్న 'ఓజీ' చిత్రీకరణని పునః ప్రారంభించినట్టు నిర్మాణ సంస్థ ప్రకటించింది. రామోజీ ఫిల్మ్‌సిటీలో కథానాయకుడు లేని కొన్ని కీలక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. 'హరిహర వీర మల్లు' పూర్తయిన తర్వాత, పవన్‌కల్యాణ్ 'ఓజీ' సెట్లోకి అడుగు పెట్టనున్నారు. ఈ రెండు సినిమాలు వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. ఎన్నికల కారణంగా గతేడాది వీటి చిత్రీకరణ నిలిచిపోయిన విషయం తెలిసిందే. వీటితోపాటు 'ఉస్తాద్ భగత్‌సింగ్' కూడా పూర్తి చేయాల్సి ఉంది పవన్. ఆయన ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే, మధ్యలో సినిమాలకి సమయం కేటాయిస్తున్నారు.

# బాహుబలి -3 ఉంటుంది

## తమిళనిర్మాత కె.ఈ జ్ఞానవేల్ ఆసక్తికర వ్యాఖ్యలు




బాహుబలి -3' గురించి తమిళనిర్మాత కె.ఈ జ్ఞానవేల్ రాజా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు సినిమా సత్తాచాటిన ఈ చిత్రం తమిళ వెర్షన్‌కు ఆయన నిర్మాతగా వ్యవహరించారు. ఈ సినిమా రెండు భాగాలు సక్సెస్ సాధించి భారీ వసూళ్లు రాబట్టడంతో అభిమానులు పార్ట్ 3 కోసం ఎదురు చూస్తున్నారు. తాజాగా కేఈ జ్ఞానవేల్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ దీనిపై ఆసక్తికర కామెంట్ చేశారు. 'కంగువా' సీక్వెన్స్‌ల మధ్య గ్యాప్‌ను సమర్థిస్తూ 'బాహుబలి 3' ప్రస్తావనను తీసుకొచ్చారు. 'కంగువా' ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. 'గత వారం బాహుబలి మేకర్స్‌తో చర్చించాను. పార్ట్ 3 ప్లాన్ చేసే పనిలో ఉన్నారు. దానికంటే ముందు రెండు సినిమాలు ఉన్నాయి. వాటి తర్వాతే 'కల్కి 2', 'సలార్ 2' రిలీజ్ అవుతాయి' అని అన్నారు. దీంతో ఈ వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. 'బాహుబలి-3' కోసం వెయిటింగ్ అంటూ ప్రభాస్ ఫ్యాన్ సోషల్ మీడియాలో పోస్ట్‌లు చేస్తున్నారు. గతంలో కూడా రాజమౌళి ఒక సందర్భం లో బాహుబలి-3' గురించి మాట్లాడారు. దీని మూడో భాగం ఉంటుంది. 'బాహుబలి' చుట్టూ జరిగే ఎన్నో సంఘటనలు ఈసారి మీకు చూపించనున్నాం. దీనికి సంబంధించిన వర్క్ చేస్తున్నాం. మా నిర్మాత శోభు యార్లగడ్డ కూడా ఆసక్తిగా ఉన్నారు. అయితే ఈ సినిమా రావడానికి కాస్త సమయం పట్టొచ్చు. కానీ 'బాహుబలి' రాజ్యం నుంచి ఆసక్తికర వార్త అయితే కచ్చితంగా ఉంటుందని అన్నారు. ప్రస్తుతం రాజమౌళి..మహేశ్ సినిమాతో 'ఎస్ఎస్ఎం బీ29' చిత్రం చేయబోతున్నారు. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించి ప్రీ ప్రొడక్షన్ పనులు, ఫొటో షూట్‌లు జరుగుతున్నాయి. అమెజాన్ అడవుల నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కనుంది. ఈ చిత్రంలో పలువురు విదేశీ నటులు కనిపించనున్నారు. భారతీయ భాషలతో పాటు విదేశీ భాషల్లోనూ ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

# సంక్రాంతికి మారిన గేమ్‌ఛేంజర్

**డిసెంబర్‌పై కన్నేసిన పలు సినిమాలు**

సినిమాల విడుదలకు పండుగలే మెయిన్ టార్గెట్. సంవత్సరం సెకెండాఫ్‌లో దసరా, దీపావళి ముఖ్య పండుగలు. వాటిని టార్గెట్ చేసుకుని మేకర్స్ సినిమాల విడుదల ప్లాన్ చేసుకుంటారు. ఈ రెండు పండుగల తర్వాత ఓ మాదిరి చిత్రాలు విడుదలవుతాయి కానీ పెద్ద చిత్రాలను విడుదల చేయడానికి అంతగా ఆసక్తి చూపించరు. ఇకపోతే జనవరి ప్రారంభం, సంక్రాంతికి సినిమాలను భారీగా ప్లాన్ చేస్తారు. అందుకు భిన్నంగా ఇప్పుడు పరిస్థితి ఉంది. డిసెంబరులోనూ పెద్ద సినిమాలు క్యూ కడుతున్నాయి. ఈ ఏడాది డిసెంబర్‌లో క్రేజీ సినిమాలు రాబోతున్నాయి. ముఖ్యంగా డిసెంబరుపై చాలా సినిమాల గురి ఉంది.డిసెంబరు 6న 'పుష్ప 2' విడుదలకు సిద్ధమైంది. 20న 'గేమ్ ఛేంజర్' విడుదల అనుకున్నారు. కానీ వాయిదా పడింది. ఆ చిత్రం సంక్రాంతి బరిలో ఉంది. అలా గేమ్ ఛేంజర్ వాయిదా పడిందో, ఆ డేట్ పై మిగిలిన నిర్మాతలు కన్నేశారు. నాగచైతన్య 'తండేల్'ని డిసెంబరు 20న విడుదల చేయాలన్నది ఓ ప్లాన్. అయితే దీనిపై అల్లు అరవింద్ ఇంకా సరైన నిర్ణయం తీసుకోలేదు. డిసెంబరు 20న నితిన్ 'రాబిన్ హుడ్' విడుదల చేసే ఆలోచనలో ఉంది చిత్రబృందం. ఇంద్రగంటి మోహనకృష్ణ, పియదర్శి కాంబినేషన్‌లో 'సారంగపాణి' అనే ఓ సినిమా రెడీ



అవుతోంది. ఈ సినిమాను డిసెంబరు 20న విడుదల చేయాలని చూస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ కూడా ఇదే డేట్‌ని ఫిక్స్ చేసింది. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో 'మ్యాజిక్' అనే సినిమా రూపుదిద్దుకొంది. డిసెంబరు 21న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నామని చిత్రబృందం ప్రకటించేసింది. అంతే కాదు మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప'ను డిసెంబరు 20 లేదా 21న విడుదల చేసే సన్నాహాల్లో ఉన్నారు. ఆగస్టు 15, వినాయక చవితి, దసరాకి చాల సినిమాలే విడుదలయ్యాయి. అయితే ఏదీ ఆశించిన రీతిలో వసూళ్లు తీసుకురాలేకపోయాయి. మళ్లీ దీపావళికి సినిమాలు వరుస కట్టాయి. డిసెంబర్‌లో క్రిస్మస్‌కు ముందు కూడా ఇలాంటి వాతావరణమే కనిపించబోతోంది. సోలోగా రావడం కంటే ఇలా పోటీ మధ్యలో వస్తేనే కిక్ ఉంటుందని నిర్మాతలు భావిస్తున్నట్లు పరిస్థితి కనిపిస్తోంది.

# డియర్ స్టూడెంట్స్'తో వస్తున్న నయనతార



లేడీ సూపర్‌స్టార్ నయనతార వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. 'టెస్ట్ , 'మన్నాన్‌గట్టి 1960' చిత్రాలు పూర్తి చేసిన ఆమె ప్రస్తుతం 'డియర్ స్టూడెంట్స్'తో సినిమాతో బిజీ కానుంది. ఇటీవల చిత్ర బృందం ఆమెను సెట్‌లోకి ఆహ్వానించారు. ఈ విషయాన్ని తెలుపుతూ నయన్ ఓ ఫొటో షేర్ చేశారు. కాలేజీ స్టూడెంట్స్ చుట్టూ తిరిగే ఈ వినోదాత్మక చిత్రాన్ని సందీప్ కుమార్, జార్జ్ ఫిలిప్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. నివిన్ పౌలీ కీలక పాత్ర పోషిస్తున్నారు. 'లవ్ యాక్షన్ డ్రామా' చిత్రం తర్వాత నివిన్, నయన జంటగా నటిస్తున్న చిత్రమిది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ఇందులో నయన విద్యా రుద్రన్ అనే టీచర్‌గా కనిపించనున్నటు సమాచారం. ప్రస్తుతం నయన జాబితాలో 'అమ్మోరు 2', 'తని ఒరువన్ 2' చిత్రాలున్నాయి.గతేడాది జవాన్, ఇరైవన్, అన్నపూర్ణ చిత్రాలతో అలరించారు నయన్.

# చిత్రసీమ అండతోనే ధైర్యంగా నిలబడ్డా

## కొండా సురేఖ వ్యాఖ్యలపై మరోమారు స్పందించిన సమంత



మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై సమంత మరోసారి స్పందించారు. తన వెబ్ సిరీస్ 'సిటాడెల్: హనీ బన్నీ' ప్రమోషన్‌లో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో దీని గురించి మాట్లాడారు. ఇటీవల చర్చనీయాంశమైన కొండా సురేఖ వ్యాఖ్యల గురించి ప్రస్తావించగా.... సమంత ఈవిధంగా స్పందించారు. 'ఈరోజు ఇక్కడ కూర్చోవడానికి ఎంతోమంది మద్దతు కారణం. చిత్రసీమకు చెందిన ప్రముఖుల ప్రేమ, నాపై వారికి ఉన్న నమ్మకమే నన్ను ఈ స్థాయిలో నిలబెట్టింది. వారు నాలో ధైర్యం నింపారు. కష్టాలను ఎదుర్కోవడంలో వారి మద్దతు నాకెంతో సాయపడింది. వారు నా పక్షాన నిలవకపోతే కొన్ని పరిస్థితులను అధిగమించేందుకు చాలా సమయం పట్టేది. నా చుట్టూ ఉన్నవారి నమ్మకం వల్లే సమస్యలను ఎదుర్కోగలిగాను' అని అన్నారు.ఆన్‌లైన్ ట్రోలింగ్‌లపై సమంత స్పందిస్తూ.. అలాంటి వాటి గురించి ఎక్కువ ఆలోచించను అని అన్నారు. 'ద్వేషపూరిత సందేశాలను స్వీకరించినప్పుడు వాటి ప్రభావం నాపై పడకుండా చూసుకుంటాను. దాన్ని పంపిన వారు కూడా అలాంటి బాధనే అనుభవించారేమో అని ఆలోచిస్తాను' అని తెలిపారు. ఇక తన అనారోగ్య కారణం వల్ల 'సిటాడెల్: హనీ బన్నీ'ను తిరస్కరించాలని భావించినట్లు సమంత చెప్పారు. రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సిరీస్‌లో ఆమె స్పై ఏజెంట్‌గా నటించారు. దీని గురించి మాట్లాడుతూ.. దర్శకులు నన్ను ఈ సిరీస్ కోసం సంప్రదించగానే నేను చేయలేనని చెప్పాను. ఈ పాత్రను చేయగలనని నిజంగా అనుకోలేదు. దానికి సరిపోయే నలుగురు హీరోయిన్ల పేర్లను కూడా రాజ్ అండ్ డీకే కు సిఫార్సు చేశాను. వాళ్లు అయితే ఈ పాత్రకు కచ్చితంగా న్యాయం చేయగలరని చెప్పాను. నేను చేయలేనని వేడుకున్నా. అయినా వాళ్లు పట్టుబట్టి నాకోసం వేచిచూశారు. ఇప్పుడు సిరీస్ పూర్తయ్యాక ఇంత గొప్ప పాత్ర ఇచ్చిన దర్శకులకు థ్యాంక్స్ చెప్పాను. మరొకరిని తీసుకోకుండా నాతో చేయడం నా అదృష్టంగా భావించానని చెప్పారు. రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో తెరకెక్కిన 'సిటాడెల్: హనీ బన్నీ'లో సమంత, వరుణ్ ధావన్‌లు ప్రధానపాత్రల్లో నటించారు. నవంబర్ 7 నుంచి అమెజాన్ ప్రైమ్ వేదికగా ఈ సిరీస్ అందుబాటులో ఉండనుంది.

# కుడి చేత్తో చేసే దానం ఎడమ చేతికి తెలియకూడదు..



మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) మెంబర్స్, వారి కుటుంబ సభ్యులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించిన శంకర ఐ ఫౌండేషన్ వారికి సినీ నటుడు 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరిలోనూ దానగుణం పెరగాలని కోరారు. గురువారం హైదరాబాద్‌లోని శంకర ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో 'మా' మెంబర్స్, వారి కుటుంబ సభ్యులకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన మంచు విష్ణు మాట్లాడారు."మొదటగా ఫీనిక్స్ ఫౌండషన్ చుక్కపల్లి అవినాష్‌గారి ధన్యవాదాలు. ఇటీవల ఆయన ఫోన్ చేసి 'మా' సభ్యుల కోసం హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నారు కదా! శంకర ఐ ఆస్పత్రిలో కూడా క్యాంపు పెడితే బాగుంటుంది'అని సలహా ఇచ్చారు. మేము అడిగిన వెంటనే ఆస్పత్రి యాజమాన్యం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శంకర ఆస్పత్రి గురించి ఇంతకు ముందే తెలిసినా, ఇక్కడకు వచ్చి చూస్తుంటే మేము ఇంకా నేర్చుకోవాల్సింది చాలా ఉందని అనిపిస్తోంది. ప్రముఖ వైద్యులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఆర్.వి.రమణి గురించి విన్నాం. ఆస్పత్రులు ఏర్పాటు చేసి, ఎంతో మందికి వారు ఉచిత కంటి వైద్యం అందిస్తున్నారు. 'కుడి చేయి ఇచ్చిన దానం ఎడమ చేయికు తెలియకూడదు' అంటారు. అందుకు ఇది నిదర్శనం ఫీనిక్స్ ఫౌండేసన్. ఎన్నో మంచి కార్యక్రమాలు చేస్తున్నా, ఎప్పుడూ బయటకు చెప్పుకోలేదు. అలాగే శంకర ఐ ఆస్పత్రి లక్షల మందికి ఉచిత చికిత్స అందిస్తోంది. వీళ్లు కూడా గొప్పలు చెప్పుకోలేదు. అందరూ వీళ్లను చూసి నేర్చుకోవాలి. మన భారతీయులకు దానం గుణం తక్కువ అంటారు. ఇప్పుడిప్పుడే ఇతరులకు సాయం చేసే గుణం అందరిలోనూ పెరుగుతోంది. ఇంకా ఎక్కువ మంది ముందుకు రావాలి. కంచి కామకోటి పీఠాధిపతులంటే మాకెంతో గౌరవం. శంకర ఐ ఆస్పత్రి ద్వారా సేవలు చేస్తుంటే, వాళ్ల ఆశీస్సులు మాకు ఇస్తున్నట్లు ఉంది. ఈ సందర్భంగా ఒక విషయం చెబుతున్నా. శంకర ఐ ఆస్పత్రికి 'మా' అసోసియేషన్ తరపున అవసరమైన సహాయ అందిస్తాం" అని మంచు విష్ణు అన్నారు.ఇక మంచు విష్ణు సినిమాల విషయానికొస్తే.. ఆయన టైటిల్ పాత్రలో ముఖేశ్ కుమార్ సింగ్ రూపొందిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కన్నప్ప'. మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. ప్రీతి ముకుందన్ కథానాయిక. ప్రభాస్, అక్షయ్ కుమార్, శరత్‌కుమార్, మోహన్‌లాల్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటున్న ఈ మూవీ త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల విడుదల చేసిన ప్రచార చిత్రాలు సినిమాపై భారీ అంచనాలను పెంచాయి.